

గృహాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి ముంచింగి పుట్టు :: మండలంలోని 23 పంచాయితీల పిఎంఎవై, పీఎం జన్మన్ గృహ లబ్ధిదారులతో ఈనెల 27న సోమవారం మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు గిరిజన సంఘం మండల కార్యదర్శి కే నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంఘం మండల కార్యదర్శి కే నరసయ్య అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నాన్ పివిటిజి గృహ లబ్ధిదారులకు తక్షణమే గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, పాఠశాల, అంగన్వాడి కేంద్రాల భవనాలకు నిధులు మంజూరు చేయాలన్నారు.సిల్వర్ ఓక్ మొక్కలకు రక్షణ గా ఇనుప కంచెలు సరఫరా చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



నినాదాలు చేస్తున్న నాయకులు



ఉరితాళ్లను వేసుకుని నిరసన చేపడుతున్న గిరిజనులు

ఎకో టూరిజం వద్దే వద్దు

- మెడకు ఉరి తాళ్లతో గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయలోని ప్రముఖ పర్యాటక సందర్శిత ప్రాంతమైన మాడగడ మేఘాలకొండ (సన్రైజ్) వద్ద మాడగడ గ్రామ గిరిజనులు ఏకో టూరిజం గో బ్యాక్, గో బ్యాక్ అంటూ వినూత్న రీతిలో తమ మెడకు ఉరి వేసుకుంటూ వినూత్న రీతిలో ఆదివారం నిరసనను తెలియజేశారు. అటవీ శాఖ ప్రతిపాదించిన ఏకో టూరిజం మాకొద్దు, మాడగడ వ్యూ పాయింట్ స్థలం అటవీ శాఖకు చెందినడి కాదని, అటవీ శాఖ మొండి వైఖరి నశించాలని, స్థానికులకు ఉపాధి కల్పించలేని ఏకోటూరిజం మాకొద్దంటూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.గత నాలుగేళ్లుగా మాడగడ, పరిసర గ్రామాలకు చెందిన సుమారు 600 మంది గిరిజనులు మేగాల కొండ వద్ద ఉపాధి పొందుతున్నారని, ఈ ఏడాది అటవీశాఖ అధికారులు వచ్చి మాడగడ మేఘాల కొండ అటవీ శాఖ ప్రాంతమని , ఏకో టూరిజంను అభివృద్ధి చేస్తామని చెప్పడం తగదని ఈ సందర్భంగా మాడగడ గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు.అటవీశాఖ ప్రతిపాదించిన ఏ కో టూరిజంను వెంటనే రద్దు చేయాలని గిరిజనలు డిమాండ్ చేశారు. అటవీ శాఖ మొండిగా వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మొంథాపై ముందస్తు చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో తీవ్ర ప్రభావం చూపనున్న మొంథా తుఫాన్ ను ఎదుర్కోవడానికి జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యింది. అల్లూరి జిల్లా పాడేరు, రంపచోడవరం డివిజన్ స్థాయిలలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అవసరమైన సహాయక చర్యలు చేపట్టడానికి అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. ఈ తుఫాన్ ప్రభావంతో 27 నుంచి నాలుగు రోజులపాటు భారీ వర్షాలతో పాటు ఈదురు గాలులు తీవ్రత అధికంగా ఉండే పరిస్థితి ఉందని వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికల మేరకు తగిన ముందస్తు చర్యలను అధికారులు తీసుకుంటున్నారు. ఈ తుపాను దృష్ట్యా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. అదే విధంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆదివారం ఈ రెండు జిల్లాల కలెక్టర్లతో తుఫాన్ ముందస్తు చర్యల పై సమీక్షించారు. అల్లూరి మన్యం రెండు జిల్లాల్లో సోమవారం జరిగే గ్రీవెన్స్ ను రద్దు చేయాలని సూచించారు. అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించాలని, వాగులు వంకలు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని.. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గిరిజన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు తుపాను సమయంలో సమన్వయంతో పని చేయాలని సూచించారు.

మెనూ అమలు చేయాలి

వసతి గృహ విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల 1 పాఠశాల వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని విద్యార్థినిలు ఆదివారం నిరసన చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం భోజనంలో బిర్యాని , చికెన్ కర్రీ పెట్టటం లేదన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, మండల వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, గిరిజన మహిళా సంఘం (ఐద్వా) మండల కార్యదర్శి ఈశ్వరిలు వసతి గృహంలో సమస్యలను అడిగి తెలుసుకుని, డిప్యూటీ ఏ టి డబ్ల్యూ ఓ జన్ని జగన్నాయ్‌ను ఫోన్లో సంప్రదించారు. గంజి అన్నం లో చల్లటి నీరు పోసి రుచి పచీ లేని విధంగా ఇస్తున్నారని తెలిపారు. రోజువారిగా మెను ప్రకారమే అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం, రాత్రి భోజనం అందించాలని డిమాండ్ చేశారు. మరుగుదొడ్లు కేవలం మూడే ఉన్నాయన్నారు. మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామన్నారు.వైస్ ఎంపీపీ 1 సత్యనారాయణ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు త్రినాథ్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను లు మాట్లాడుతూ,మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. వర్కర్లు కొరత ఉందని తెలపడంతో తాత్కాలికంగా ఒక వర్కర్ ని ఏర్పాటు చేస్తానని డిప్యూటీ ఏ టి డబ్ల్యూఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ సభ్యుడు నారాయణ, గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు గాసిరం దొర, ఎస్ఎఫ్ఐ నాయకులు పి గణేష్, చరణ్ పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న విద్యార్థులు

పోరాటాలతోనే అంగన్వాడీ మెయిన్ సెంటర్లుగా మార్పు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: పోరాటాల ద్వారానే మినీ అంగన్వాడి సెంటర్లు మెయిన్ సెంట్రల్ గా మార్పు చేశారని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం అరకువేలి గిరిజన సంఘం భవనంలో నాగమ్మ అధ్యక్షతన మినీ అంగన్వాడీల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 42 రోజులు సమ్మె అంగన్వాడీలు ఐక్యంగా సమరశీలంగా పోరాటాలు నిర్వహించడం ఫలితంగానే మినీ అంగన్వాడీలు సమస్యల పరిష్కరించుకున్నారని తెలిపారు. జీతాల పెంపు వంటి సమస్యపై భవిష్యత్తులో ఆందోళనకు సిద్ధం కావాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యి మాట్లాడారు. బెదిరింపులకు బెదరకుండా పట్టుదలతో ఐక్యంగా ఉద్యమించి విజయం సాధించిన మినీ అంగన్వాడీలకు ఉద్యమ అభినందనలు తెలియజేశారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడి సెంటర్లను బలోపేతానికి కృషి చేయాలని, అంగన్వాడి కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణం కూటమి ప్రభుత్వం వేతనాల పెంపు హామీని అమలు చేయాలని, కనీస వేతనం 26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కార్యకర్తలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు.అర్హత ఉండి మినీ అంగన్వాడీలు కొంతమంది ప్రమోట్ కాలేదని తక్షణం అందర్నీ ప్రమోట్ చేయాలని,రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, సిఐటియు అరకువేలి మండల కన్వీనర్ జె భగత్ రాం, డుంబ్రిగూడ ప్రాజెక్టు నాయకులు పవిత్ర, సత్యవతి, అరుకు ప్రాజెక్ట్ నాయకులు లక్ష్మి, పి. గౌరమ్మ, భాను, లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

వైద్యం అందించకపోవడంతోనే విద్యార్థిని మృతి

కుటుంబీకుల ఆరోపణ

ప్రజాశక్తి -అనంతగిరి: అనారోగ్యంతో బాధ పడుతున్న విద్యార్థినీ కి సరైన సమయంలో వైద్య సేవలు సకాలంలో అందించక పోవడంతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రికి తీసుకెళండి లేదా తన కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని మృతి చెందిన విద్యార్థిని పలుమార్లు పాఠశాల యాజమాన్యాన్ని కోరినప్పటికీ స్పందించ లేదని, ఆరోగ్యం విసమ్మించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు మండలంలోని బీంపోలు బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సమ్మిరెడ్డి. అంజలి శనివారం మృతి చెందింది. గత పది రోజులు నుండి అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినికి సమయంలో సరైన వైద్య సేవలు అందించడంలో పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించడంతోనే ఆరోగ్యం క్షిణించి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. తమకు ముందే సమాచారం అందించి ఉండి ఉంటే తమ పాప మృతి చెందేది కాదన్నారు.



చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి రికార్డ్

- ఒకే నెలలో 100 ప్రసవాలు
- జిల్లాలో అన్ని ఆసుపత్రులకంటే టాప్
- సూపరింటెండెంట్, గైనకాలజిస్టులు, సిబ్బంది కృషి
- అభినందించిన ఐటిడిఎ పిఒ



చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డు

ప్రజాశక్తి-చింతూరు: చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి రికార్డు సృష్టించింది. ఆసుపత్రి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 100 ప్రసవాలు అక్టోబర్‌లో అవ్వడంతో ఈ రికార్డు సొంతం చేసుకుంది. పదేళ్ల క్రితం విలీన మండలాలైన చింతూరు, కూనవరం, ఎటపాక, వరరా మచంద్రాపురం మండలాలకు వైద్యసేవలు అందని ద్రాక్షగా ఉండేవి. దీంతో ప్రజలు వైద్యసేవలకోసం ఇబ్బందులు పడేవారు. చింతూరు ఆసుప్రత్రి 2018 నుండి కమ్యూనిటీహెల్త్‌సెంటర్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. 2022 నుండి స్పెషలిస్ట్ వైద్యులను వైద్య ఆరోగ్యశాఖ నియమించడంతో ఈ ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యసేవలు అందు బాటులోకి రావడంతో విలీన మండలాలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. చింతూరు ఆసుపత్రిలో ఇద్దరు గైనకాల జిస్టులు, ఒకరు ఆర్థోపెడిక్, ఒకరు జనరల్ ఫిజిషియన్, చెవి ముక్కు, గొంతు వైద్యులు, పిల్లల వైద్యులు, అనస్థీషియా (మత్తు డాక్టర్), ఇద్దరు జనరల్ వైద్యులను నియమించడంతో ప్రజలకు మంచి సేవలు అందే అవకాశం వచ్చింది.

ప్రసవాలపై ప్రత్యేక దృష్టి

2023లో డాక్టర్ ఎం.వి.కోటిరెడ్డి సూపరింటెండెం ట్‌గా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో ఆయన అన్నిరకాల వైద్యసేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా ప్రసవాలు పెంచడం అన్నిరకాల ఆపరేషన్లు చింతూరులో జరిగే విధంగా ప్రయత్నించడంతో ఆసుపత్రి లో రోజువారీ ఔట్‌పేషెంట్ విభాగం, ఇన్ పేషెంట్ విభాగం సేవలు బాగా పెరిగాయి. ముఖ్యంగా ప్రసవాలు ఎక్కువగా పెరిగేందు కు చర్యలు తీసుకున్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి ఎనస్థీషియా డాక్టర్ కావడం, గైనకాలజిస్ట్‌లు డా. ఎం వి. రమణారావు, డాక్టర్ శశికళ సమిష్టి కృషితో ప్రసవాల పెంపునకు కృషి చేశారు. దీంతో అక్టోబర్‌లో 100 ప్రసవాల టార్గెట్‌ను సాధించడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ఎక్కువ ప్రసవాలు జరిగి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందంజలో ఉంది.



బాలింతను చూస్తున్న సిస్టర్

చిన్నపిల్లల యూనిట్‌లో ప్రత్యేకంగా వైద్యసేవలు

ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్య సేవలకోసం కోసం ఏర్పాటైన నవజాత శిశుకేంద్రం (ఎస్ఎన్‌సీ యూ)లో అప్పుడే పుట్టిన బిడ్డ నుండి ఏడాది లోపు ఉన్న చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లల వైద్యాధికారి డాక్టర్ మహేష్ ఆధ్వర్యంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న పిల్లలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే కాకుండా శిశుమరణాలను తగ్గించేందుకు ఈయూనిట్ ఉపయోగ పడుతోంది. చిన్నపిల్లల వైద్యసేవల కోసం పిడియాట్రీషియన్, వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండడం విశేషం.

నాలుగు రాష్ట్రాల ప్రజలకూ వైద్యసేవలు

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి నాలుగు రాష్ట్రాల ప్రజలకూ వైద్య సేవలు అందిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఒడిశా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల ప్రజలకు ఇదే ప్రధాన ఆసుపత్రి. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి లో స్పెషలిస్ట్ వైద్యులతో పాటు స్కానింగ్, ఎక్స్‌రే, అన్ని రకాల రక్త పరీక్షలు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవలు, డయాలసిస్ సేవలు, ఎన్ఆర్‌సి కేంద్రం, ఎస్ఎన్‌సియూ కేంద్రం ఉండడంతో ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, చింతూరు ఐటిడిఎ పిఒ శుభంనొక్వాల్, డిసిహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ పుల్లయ్య సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి

ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేయాలి. ప్రస్తుతం జనరల్‌ఫిజిషియన్, ఇఎన్‌టి, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వైద్యపోస్టులు భర్తీ చేస్తే ఇంకా ప్రజలకు వైద్యసేవలు అందించవచ్చు.

100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్

చింతూరు ప్రభుత్వ ఆసుపత్రి ఇటీవల 100 పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ అయింది. దీంతో త్వరలోనే ఇంకా మెరుగైన వైద్యసేవలు అందనున్నాయి.

అంతా అప్రమత్తం..

- తుఫాన్ నేపథ్యంలో రెవెన్యూ సిబ్బందికి సెలవులు రద్దు
- పర్యాటక బోట్ల యజమానులకు నోటీసులు
- వాగులు, గెడ్డలు దాటొద్దని అధికారుల హెచ్చరిక

ప్రజాశక్తి- జీకే వీధి: తుఫాను కారణంగా మూడు రోజుల భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బందికి ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవని, పంచాయతీ కేంద్రంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండాలని తహశీల్దార్ అన్నాజీరావు సూచించారు. తుఫాను కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించలన్నారు. అత్యవసర అయితే విఆర్ఒను సంప్రదించి తక్షణ సాయం పొందాలని సూచించారు.

ఎటపాక: ఎటపాక సర్కిల్ పరిధిలోని 3 మండలాల ప్రజలకు తుఫాన్ కారణంగా ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎటపాక సిఐ కన్నపరాజు సూచించారు. దీనికి సంబంధించి ఆదివారం ఒక ప్రకటన చేశారు. తుఫాన్ కారణంగా పాపికొండల యాత్ర రద్దు చేశామన్నారు. 27,28,29 స్థానిక ప్రజలు కూడా ఎటువంటి ప్రయాణాలు చేయకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. ముఖ్యంగా ఎటపాక కూనవరం మండలాలకు అధిక వర్షాలు కురుస్తాయని హెచ్చరికలు జారీ చేశారని, కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల్లోకంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేశారని, ఎటపాక కంట్రోల్‌రూమ్- 8885425365, 8309029520, విఆర్‌పురం-8008100892, కూనవరం- 9652814712 కి ఫోన్ చేసి సమాచారం తెలపాలన్నారు.

రాజవొమ్మంగి: రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ అల్లు సత్యనారాయణ సూచించారు. వాగులు వంకలు దాటవద్దని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండలంలోని ఒట్టిగెడ్డ, చిన్నకాలువ, మడేరు వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున దాటకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే అధికారులను టీములుగా ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. తుఫాన్ సమయంలో విద్యుత్ తీగలు, చెట్లు లేదా కూలిన భవనాల సమీపానికి వెళ్లకూడదని, పాతబడిన ఇళ్లల్లో ఉండరాదని సూచించారు.

దేవీపట్నం: తుపాన్ కారణంగా విహార యాత్రకు పర్యాటక బోట్లు వెళ్లకూడదని నోటీసులు జారీ చేసినట్లు దేవీపట్నం ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఆదివారం దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీపంలో ఉన్న బోటు పాయింటును, పర్యాటక బోట్లను ఎస్సై, సిబ్బంది పరిశీలించారు. బోట్ల యజమానులతో మాట్లాడారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఇటువంటి సమయంలో గోదావరిలో బోట్లు ప్రయాణించడం ప్రమాదకరమని ఎస్సై చెప్పారు. రంపచోడవరం డిఎస్‌పి సాయిప్రశాంత్, సిఐ సన్యాసినాయుడు ప్రత్యేక సూచనలు చేశారని తెలిపారు. 15 పర్యాటక బోట్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఎస్సై తెలిపారు.



బోటు యజమానికి నోటీస్ ఇస్తున్న ఎస్ఐ షరీఫ్

రైతులు జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: తుఫాన్ నేపథ్యంలో పంటలు రక్షించుకునేందుకు జాగ్రత్తలు పాటించాలని స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ ఆదివారం కోరారు. పత్తి, వరి ఇతర పంటల విషయంలో పొలాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని, రసాయనిక ఎరువులు పరిమితంగా వాడాలని సూచించారు. విచక్షణ రహితంగా మందులు వాడితే దిగుబడి తగ్గిపోతుందన్నారు. వరిలో కాలువలు ఏర్పాటు చేసుకుంటే నీరు దిగువకు పోవడానికి అవకాశం ఉంటుందన్నారు. వరి దుబ్బులు గాలికి పడిపోకుండా రెండు, మూడు దుబ్బులను కలిపి కట్టలా కట్టుకుంటే గాలికి పడిపోకుండా ఉంటుందన్నారు.

పలుచోట్ల వర్షం



సీలేరులో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి -సీలేరు: మొంథా తుఫాన్ కారణంగా జికె వీధి మండలం సీలేరులో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. 26 నుంచి 29 వరకూ తుఫాన్ ప్రభావం అల్లూరి సీతారామరాజు జిల్లాకు ప్రభా వం అధికంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ప్రకటించారు. వర్షం కారణంగా సీలేరులో ఆదివారం వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. .

డుంబ్రిగుడ: మండలంలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో భాగంగా సాయంత్రం కురిసిన వర్షంతో మండల గిరిజనులు అప్రమత్తమయ్యారు. ఈనెల. 27 నుంచి భారీ వర్షాలు కురుస్తాయన్న ప్రచారంతో గిరిజనులు తుఫానుపై భయాందోళన చెందుతున్నారు.

పిఎం జన్‌మన్ బిల్లులు ఆలస్యం

ప్రజాశక్తి-జికేవీధి : మండలంలోని పిఎం జన్‌మన్ లబ్ధిదారుల బిల్లులను సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నిలుపుదల చేసిందని గూడెంకొత్తవీధి గృహనిర్మాణశాఖ ఎఇ లక్ష్మివిమల తెలిపారు. అందువల్ల లబ్ధిదారులెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

వైద్య కళాశాలల ప్రయివేటీకరణ వద్దు

ప్రజాశక్తి- పాడేరు: రాష్ట్రంలోని వైద్య కళాశాల లను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తే సహించబోమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ తెలిపారు. విద్యారంగ సమస్యలపై ఈనెల 22 నుంచి ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న బస్సు యాత్ర ఆదివారం పాడేరు చేరుకున్న సందర్భంగా స్థానిక వైద్య కళాశాల ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజశేఖర్ ఆధ్వర్యన కళాశాలను సందర్శించారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలరాజు, నాసార్జీ మీడియాతో మాట్లాడుతూ గిరిజన, పేద విద్యార్థుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేకుండా కూటమి ప్రభుత్వం పరిపాలన చేస్తుందని విమర్శించారు. పి పి పి విధానం అమలు చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలనీ భావిస్తుందన్నారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియాంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు ఫణింద్ర, కుళాయి స్వామి, నాగభూషణం, మస్తాన్, కృష్ణ పాల్గొన్నారు..

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండలంలో పర్యాటక ప్రాంతాలైన చాపరాయి జలపాతం, అరకు పైనరీలో ఆదివారం పర్యాటకుల తాకిడి నెలకొంది. మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో కిటకిటలాడాయి. చాపరాయిలో పర్యాటకులు స్థానాలు చేస్తూ ఆనందంగా గడిపారు. వస్త్ర వేషాధారణ ధరించి దింసా నృత్యాలు ప్రదర్శిస్తూ సందడి చేశారు. అంజోడా సిల్క్ ఫారం, అరకు పైనరీ ఉద్యానవనంలో వ్యూ పాయింట్ వద్ద ఫోటోలు తీయించుకుంటూ సందడి చేసి హాయిగా గడిపారు

జిఎస్టిపై అవగాహన

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన జీఎస్టీతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ 15వేలు ఆదా కలిగిందని టిడిపి అరకు పార్లమెంటరీ కోశాధికారి వి నాగేశ్వరరావు అన్నారు. కిల్లోగుడలో మాజీ సర్పంచి లక్ష్మి ఆధ్వర్యాన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతికే కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయంలో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటడంతో పేద, మధ్య తరగతి ప్రజానీకం ఇబ్బందులు పడ్డారన్నారు.బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మాజీ ఎంపీపీ దన్నెరావు, టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి స్వామి, నేతలు భూషణం, లక్ష్మణరావు, దొన్ను, రాజ్కుమార్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.7,500 ఇవ్వాలి

ప్రజాశక్తి -తగరపువలస : పెన్షనర్లకు కనీస పింఛన్ రూ.7.500 ఇవ్వాలని పెన్షనర్ల సంఘం నాయకులు కానూరి రాంబాబు డిమాండ్చేశారు. స్థానిక చిట్టివలస జూట్ మిల్లు కల్యాణ మండపంలో ఆదివారం చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కానూరి రాంబాబు మాట్లాడుతూ, పెన్షనర్ల పరిస్థితి చాలా అధ్వానంగా ఉందన్నారు. అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ఈ వయసులో కనీస పెన్షన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి బాబాజీ మాట్లాడుతూ, కనీస పెన్షన్పై ఎంపీలు, అధికారులకు వినతిపత్రాలు అందించినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో చలనం లేదని, మొండి వైఖరిగా ఉన్నాయని విమర్శించారు. అప్పారావు, మోర అప్పలరాజు మాట్లాడుతూ, డిసెంబర్ 9, 10తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిల్ల అప్పారావు, పి.సూర్యనారాయణ, ముత్యాలు, కర్రి రాము, నర్సింగరావు, కె.పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- మాధవధార : దోబీఘాట్లు వద్ద పాకలు, షెడ్లు వేసుకొని నివసిస్తున్న రజక వృత్తిదారులకు సర్వే చేసి పట్టాలు మంజూరుచేయాలని ఏపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్వరపు ఈశ్వరరావు డిమాండ్చేశారు. కంచరపాలెంలోని బిఎన్ఆర్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం సమావేశం జి.కన్నయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, జివిఎంసి 49వ వార్డు పరిధి ఎస్ఆర్.నగర్ దోబీ ఘాట్ వద్ద 20 మంది రజక వృత్తిదారులు వృత్తి చేస్తూ తమ కుటుంబాలతో అక్కడే నివసిస్తున్నారని తెలిపారు. సొంత ఇల్లు లేక ఇంటి అద్దె కట్టుకోలేక చాలాకాలంగా ఉంటున్న వారి ఇళ్లకు సర్వే జరిపించి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

అరకు ఏరియా హాస్పిటల్లో బొద్దింకల బెడద

-అపరిశుభ్రంగా బెడ్లు, దుప్పట్లు

- భయంతో నేల మీద పడుకుంటున్న రోగులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ ఏరియా హాస్పిటల్ లో చిన్న పిల్లల వార్డులో రోగులు పడుకునే బెడ్లు, దుప్పట్లు పరిశుభ్రత లేకపోవడంతో బెడ్ల లోపల నల్లని బొద్దింకలు చేరి అపరిశుభ్రంగా ఉండటంతో రోగులు రాత్రి పూట నిద్రపోకుండా తప్పని పరిస్థితిలో చిన్న పిల్లలతో నేల మీద పై పడుకోవసిన పరిస్థితి నెలకొందని ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనులకు ఆరోగ్యం బాగోలేకపోతే అరకు ఏరియా హాస్పిటల్ లో చేరి చికిత్స పొందాలంటేనే ఇటువంటి సంఘటనలు చూసి భయపడుతున్న పరిస్థితి ఉందన్నారు. దీంతో కొంతమంది అప్పు చేసి అయిన ప్రైవేట్ హాస్పిటల్ కు వెళ్లి చికిత్స పొందుతున్నారన్నారు.ప్రభుత్వం ఒక వైపు గిరిజనులకు మెరుగైన వైద్యం అందించడానికి కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రచారం చేస్తుంటే మరో వైపు కనీసం రోగులకు బెడ్లు, దుప్పట్లు అపరిశుభ్రంగా ఉండడంతో వివిధ పురుగులు, బొద్దింకలు చేరి రోగులను ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి ఉందని పేర్కొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు



చని పోయిన బొద్దింకలు

అరకులోయ ఏరియా హాస్పిటల్ లో స్పెషలిస్ట్ డాక్టర్స్ రోజు అందుబాటులో లేకపోవడంతో రోగులకు సకాలంలో వైద్యం అందక రోగులు వేరే హాస్పిటల్ కు వెళ్లి చికిత్స తీసుకొంటున్న సందర్భాలు చాలా ఉన్నాయని అన్నారు. రోగులకు ఆర్థిక భారం ఒక వైపు, మరోవైపు సకాలంలో చికిత్స పొందలేక పోతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే ప్రభుత్వ హాస్పిటల్ లో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించి, అన్ని టెస్టులు నిర్వహించి, స్పెషల్ డాక్టర్స్ ను నియమించి ఇక్కడే అన్ని రోగులకు చికిత్స జరిగేటట్లు ప్రతి రోజు స్పెషల్ డాక్టర్స్ అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు కె బుజ్జి బాబు,రోగులు ఉన్నారు.

అధ్వానంగా రంగినివలస రోడ్డు


ప్రజాశక్తి- దుంబ్రిగుడ : మండలంలోని పోతంగి పంచాయతీ రంగిని వలస రోడ్డు బురదమయంగా మారి అధ్వాన్నంగా తయారైంది. దీంతో ఆ ప్రాంత గిరిజనులు రవాణ సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతర్ల నుండి చెలిమరవలస మీదుగా తారు రోడ్డు నిర్మాణానికి గత రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి.అప్పటి నుంచి ఇప్పటి వరకు నిర్మాణ పనులు జరగలేదు. సుమారు గత రెండు నెలలు నుంచి పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణానికి మట్టి తీసి రోడ్డు మీద వేసి ఉండడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు అంత పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో ఆ రోడ్డుకు వెళ్లే వాహనాలు బురదలో కూరుకు పోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు అనుకుని వంటర్ల, చేలిమరవలస, గట్టిగూడ, కొంతుగూడ, రంగినివలసతో పాటు మరో రెండు గ్రామాలు ఉన్నాయి. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో ఆ ప్రాంత గిరిజనులు పండించిన కూరగాయలు, అటవీ ఉత్పత్తులు విక్రయించడానికి వారపు సంతలకు తరలించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనారోగ్యాలకు గురైన వైద్య గ్రస్తులకు 108 అంబులెన్సులో ఆసుపత్రికి కూడా తరలించ లేక పోతున్నామని గిరిజనులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం వేగంగా పూర్తి చేసి రవాణాకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరారు.



అధ్వానంగా ఉన్న రహదారి

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-అనంతగిరి:రోడ్డు పరిశుభ్రం చేపట్టేందుకు గిరిజనులు ఊరారా కదలి శ్రమదానంతో పనులు చేపట్టారు. మండలంలోని వేంగడ పంచాయితీ గద్యవలస గ్రామం నుండి హుకుంపేట మండలం పట్టం పంచాయతీ భైరవవలస గ్రామం వరకు ఐదు కిలోమీటర్ల మేర వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డుపై విరిగిపడ్డ బండరాళ్లు, మట్టి పెల్లలు తో పాటు పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేసామని గ్రామస్తులు మజ్జి. గోవిందు, వార్డు మెంబర్ కేశవ్లు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా పనులు చేశామని చెప్పారు. వేంగడ గ్రామం నుండి మెటువలస మీదుగా వాలసి, నిమ్మలపాడు రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకుని పరిశుభ్రత పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయుడు, డొంబు, లింగన్న. రాము పాల్గొన్నారు.



పనులు చేపడుతున్న గిరిజనులు

నేరాలు ఘోరాలు



పట్టుబడిన గంజాయి నిందితులతో పోలీసులు

137 కిలోల గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితుల అరెస్ట్ : ఇద్దరు పరారీ

ప్రజాశక్తి- చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పోలీసుల తనిఖీల్లో 137 కిలోల గంజాయి పట్టుబడింది. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం సమయంలో లోతుగడ్డ బ్రిడ్జి వద్ద చింతపల్లి సిఐ ఎం. వినోద్బాబు ఆదేశాలతో అన్నవరం ఎస్ఐ జి. వీరబాబు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బ్రెజ్జా కారు, పల్సర్ బైక్, హోండా బైక్పై గంజాయి తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను గుర్తించారు. పోలీసులు వీరిని ఆపేందుకు యత్నించగా పారిపోబోయారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు మాత్రం పారిపోయారు. బ్రెజ్జా కారులో 3 గంజాయి మూటలు, పల్సర్ బైక్, హోండా బైక్పై చెరో మూటతో కలుపుకుని మొత్తం ఐదు మూటల్లో 137 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన మూడు వాహనాలతోపాటు మూడు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ముగ్గురిలో ఇద్దరు చింతపల్లి మండలానికి చెందినవారు కాగా, ఒకడు జీకే వీధి మండలానికి చెందినవారు. పరారైన ఇద్దరూ చింతపల్లి మండలానికి చెందిన వారేనని పోలీసులు తెలిపారు. ఏజెన్సీ నుంచి నర్సీపట్నం ప్రాంతానికి గంజాయి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. పరారైన ఇద్దరిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని పోలీసులు తెలిపారు.

చెరువులో జారి పడి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని నారపాడు పంచాయతీ నారపాడు గ్రామానికి చెందిన నరవ అప్పలరాజు (45) బహిర్భూమికి వెళ్లి కాలుజారి చెరువులో పడిపోయి గల్లంతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం, నారపాడుకు చెందిన అప్పలరాజు కార్పెంటర్గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో బహిర్భుమికి వెళ్లి చెరువులో దిగే సమయంలో కాలు జారిపడి గల్లంతయ్యాడు. అందరూ చూస్తుండగానే నీటిలో మునిగిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఎంతగాలించినా అప్పలరాజు ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో బంధువులు కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. అప్పలరాజుకు భార్య నరవ దేవి కుమార్తె ప్రవల్లిక, కుమారుడు గౌతమ్ ఉన్నారు. ప్రవల్లిక 9వ తరగతి, కుమారుడు గౌతమ్ మూడవ తరగతి చదువుతున్నారు. అప్పలరాజు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్థానిక సిఐ జి రామచంద్రరావును వివరణ కోరగా అప్పలరాజు చెరువులో గల్లంతుపై ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేసులో వీడిన మిస్టరీ

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్లో ఈ నెల 13వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వక్తి కేసును పోలీసులు ఛేదించారు. పోలీసుల దర్యాప్తులో హత్యగా నిర్ధారించి ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి, రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు. గాజువాక స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో క్రైమ్ డిసిపి లతా మాధురి మాట్లాడుతూ, చత్తీస్గడ్ రాష్ట్రం, మహాసముంద్ జిల్లా, సరై పాలి గ్రామానికి చెందిన ఇంద్రపాలు (27), రతి నాయక్ (25)లు హత్యకు గురైన మీరాజ్ హుస్సేన్ను ఈనెల 13వ తేదీన ఒడిశా రాష్ట్రంలోని రాయగడ బ్రిడ్జి వద్ద కలుసుకొని అతని ట్రక్కులో కరడా చెక్ పోస్ట్ వద్ద ఎక్కారు. గాజువాక ఆటోనగర్ వచ్చారు. ముగ్గురు కలిసి ఆటోనగర్లో మద్యం తాగారు. మీరాజ్ హుస్సేన్ వద్ద నగదు నగదు, మొబైల్ ఫోను దొంగలించే క్రమంలో మీరాజ్ హుస్సేన్ను ఇంద్రపాలు, రతినాయక్ ఇనుపరాడ్తో కొట్టి చంపారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

'అడవులను అదాని, అంబానీలకు అమ్మేస్తున్నారు'

ప్రజాశక్తి -సీలేరు: ఆదాని,అంబానీకి అనుకూలమైన 51 ,13, 2 జిఒలను జారీ చేసి బాక్సైట్, లేటరైట్ హైడ్రోపవర్ ప్రాజెక్టులు నవయుగ కంపెనీ పేరుతో అడవులను అదాని, అంబానీలకు అమ్మేస్తున్నారని గిరిజన సమైక్య మండల కార్యదర్శి నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివాసీలకు పరిరక్షణలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో ఈ నెల 30న నిర్వహించే మహాసభకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ గంగవరంలో ఆదివారం ఆదివా సీలతో సమావేశమయ్యారు. అనంతరం మహాసభకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో 1/70 చట్టం పేరుకు మాత్రమే ఉందని అమలు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. జిఒ నంబర్ 3 రద్దుతో గిరిజనుల్లో నిరుద్యోగం తీవ్రంగా పెరిగిందన్నారు. ఇప్పటికైనా ఆదివాసీలు మేల్కొని ఆదివాసీల హక్కులపై పోరాటం హక్కులు సాధించుకోవాలని కోరారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని ఆదివాసి మహాసభలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి- జికేవీధి: జిల్లా వైసిపి అధ్యక్షులు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు సూచనల మేరకు వైసిపి సీనియర్ నాయకులు పలాసి చిన్నారావు, మామిడి గోపాల్, దేశగిరి మురళి, దేశగిరి వీరన్న పడాల్ ఆధ్వర్యంలో ఆదివారం రింతాడ పంచాయతీ అసరాడలో ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 28న పాడేరులో జరిగే ప్రజాపోరు కార్యక్రమం జయప్రదం గురించి వివరించారు. కార్యక్రమంలో దేవరాజు చిన్నతల్లి, దేసగిరి మురళీ, మామిడి గోపాల్ పాల్గొన్నారు.



ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న బిఎం సూర్యనారాయణ

అగ్రస్థానంలో గోకవరం ఎల్ఐసి బ్రాంచి

- బ్రాంచి మేనేజర్ సూర్యనారాయణ

ప్రజాశక్తి- గంగవరం : గోకవరం ఎల్ఐసి బ్రాంచి వ్యాపార లక్ష్య సాధనలో రాజమండ్రి డివిజన్లో ప్రథమ స్థానంలో నిలిచిందని బ్రాంచి మేనేజర్ డి.వి.సూర్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోకవరం బ్రాంచ్ , గోకవరం, కోరుకొండ, ఏలేశ్వరం మండలాలో పాటు ఏజన్సీ ఏడు మండలాల్లో ప్రజలకు సేవలు అందిస్తోందన్నారు. పాలసీల సేకరణ, గోకవరం బ్రాంచి రాజమండ్రి డివిజన్లో అగ్రస్థానంలో ఉందన్నారు. డెత్క్లైమ్స్, మెచ్యూర్టీ క్లైమ్స్ సెటిల్మెంట్లో ఆల్ఇండియా స్థాయిలో కూడా మంచి స్థానంలో ఉందన్నారు. అనంతరం పాలసీదారుల సేవా కేంద్రంలో సేవలను పరిశీలించారు. ఏజెంట్స్తో సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ (ఏబిఎం) విజయకోటేశ్వర రావు, ఏలేశ్వరం ఎస్ఒ బ్రాంచి మేనేజర్ ఎం.వి.ఎస్.రెడ్డి, గంగవరం, అడ్డతీగల , ఏజెంట్లు జయకష్ణ పట్నాయక్ , వెంకన్నదొర, రామమూర్తి, అప్పారావు పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

ప్రజాశక్తి-సీలేరు: ధారకొండ పంచాయతీని మండల కేంద్రంగా ప్రభుత్వం ప్రకటించాలని మండల సాధన కమిటీ నాయకులు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి సుంకర విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం వారపు సంతలో భారీ ర్యాలీ నిర్వహించారు. ధారకొండను మండల కేంద్రంగా చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు పార్టీలకు అతీతంగా ఆరు పంచాయతీల ప్రజలు ధారకొండను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారన్నారు. సీలేరు, ధారకొండ, దుప్పిలివాడ, గుమ్మిరేవులు, ఎ.దారకొండ, గాలికొండ పంచాయతీ పరిధి వందలాది గ్రామాలు అభివృద్ధిలో బాగా వెనుకబడి ఉన్నాయని గ్రామాలు అభివద్ధి చెందాలంటే మండల కేంద్రం ఏర్పాటు తప్పనిసరి అన్నారు. ధారకొండ మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్కి వినతిపత్రం అందించామని దీనికి సంబంధించిన నివేదిక ప్రభుత్వానికి పంపిస్తానని ఆయన హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మండల కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రైతులు ప్రభుత్వ కార్యాలయాలకు ఇతర భవనాలకు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల సాధన కమిటీ నాయకులు శోభ, జగన్, ధమ్మంతి, ఎంపిటిసి మాడి రామన్న తదితరులు పాల్గొన్నారు.



ధారకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మండల సాధన కమిటీ

విశాఖ కీర్తిని విశ్వవ్యాపితం చేయాలి

సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి

విజయవంతంగా ముగిసిన జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నం కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేయాలని విశాఖ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆకాంక్షించారు. ఆదివారం విశాఖ పోలీస్ బేరక్స్ గ్రౌండ్స్లో ఘనంగా నిర్వహించిన 'జిల్లా వెటరన్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్-2025 (వావ్)' పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించి విశాఖ కీర్తిని విశ్వవ్యాప్తంగా చాటాలని పిలుపునిచ్చారు. పోటీల్లో విజేతలకు ఆయనతో పాటు వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ చైర్పర్సన్ డాక్టర్ కమల్బైడ్, మాజీ ఎడిసిపి మహమ్మద్ఖాన్ తదితరులు స్వర్ణ, కాంస్య, రజత పతకాలతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో గెలుపొందిన క్రీడాకారులను డిసెంబర్ 13, 14వ తేదీల్లో గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన 'వావ్' చీఫ్ ప్యాట్రన్, వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్చైర్పర్సన్ డాక్టర్ కమల్బైడ్ మాట్లాడుతూ, ఆర్థిక స్తోమత లేని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తూ 'వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ (వావ్)'ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాను ఛైర్పర్సన్గా, నండూరి రామకృష్ణ, శుభోద్కుమార్ రాకేచ, కపిల్ అగర్వాల్, మంగా వరప్రసాద్, సీహెచ్. శ్రీనివాసరాజును ధర్మకర్తలుగా నియమించినట్లు పేర్కొన్నారు. ఇందులో 5కి.మీ వాకింగ్, 100 నుంచి 5వేల మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్ పుట్, డిస్క్ త్రో, జావెలిన్ త్రో, హేమర్ త్రో పోటీలు జరిగాయి. పోటీలు వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ ఛైర్పర్సన్ డాక్టర్ కమల్ బైడ్ , వావ్ పిఆర్ఒ వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్. సుధాకర్, కోశాధికారి రామారావు సారధ్యంలో నిర్వహించారు.

బివి.రామారావు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: ప్రముఖ పారిశ్రామికవేత్త బలుసు వెంకట రామారావుకు పలువురు నివాళులర్పించారు. పాతవెంకోజీపాలెం ఎమ్వివి.ప్రెసిడెన్సీ ఆడిటోరియంలో ఆదివారం రామారావు వర్ధంతి నిర్వహించారు. బి.వి.రామారావు కుమారుడు బి.వి.రామ్ నేతత్వంలో కుటుంబసభ్యులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్రాజు, 32వ వార్డ్ కార్పొరేటర్ కందుల నాగరాజు మాట్లాడుతూ, పారిశ్రామిక రంగానికి బి.వి.రామారావు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. మంచి పరిపాలనా దక్షత, దూరదృష్టి కలిగిన చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, అందరికంటే ముందు 1994లోనే బి.వి.రామారావు ఆకాంక్షించారన్నారు. కార్యక్రమం లో రామారావు భార్య బలుసు సతీసావిత్రి, కుమారుడు వెంకటరామ్ పాల్గొన్నారు.

నగరంలో ప్రతి లైట్ వెలిగేలా చూడాలి

కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: నగరంలో ప్రతి విద్యుత్లైట్ వెలిగేలా కార్యాచరణ చేపట్టాలని జివిఎంసి కమిషనర్ కేతన్గార్గ్ జివిఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి ఆయన నగరంలోని బీచ్ రోడ్డు ప్రాంతంలో కోస్టల్ బ్యాటరీ నుండి తొట్లకొండ వరకూ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాలను జివిఎంసి అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, జివిఎంసి ప్రధాన ఇంజనీరు పివివి సత్యనారాయణరాజు, పర్యవేక్షక ఇంజనీరు సంపత్ కుమార్తో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. పరిశీలనలో కమిషనర్ ముందుగా కోస్టల్ బ్యాటరీ నుండి తొట్లకొండ వరకూ వెళ్లే బీచ్రోడ్లోని వెలగని పలువీధి లైట్లను గుర్తించి, వాటి నిర్వహణపై సంబంధిత ఎలక్ట్రికల్ విభాగం ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. తక్షణమే వెలగని లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆదేశించారు. నగరంలో ప్రధాన కూడళ్ళు, హైవేలు, ప్రధాన రహదారులు, బీచ్ రోడ్, కాలనీల్లో నిత్యం లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ విభాగం సహాయక ఇంజనీర్లను ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 49 మంది అసిస్టెంట్ ఇంజనీర్లు (ఎలక్ట్రికల్) ను వర్కింగ్ అరేంజ్మెంట్ ఆధారంగా ప్రతి ఇద్దరు వార్డులకు ఒకరిని ఇన్చార్జ్గా నియమించామని, వారు నగరంలోని వీధి దీపాల సంరక్షణ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించేలా, నిత్య పరిశీలన జరిపి వీధిలైట్లు వెలిగేలా కార్యచరణ చేపట్టాలని ప్రధాన ఇంజనీర్ పివివి సత్యనారాయణరాజుకు కమిషనర్ ఆదేశించారు. జోనల్ కమిషనర్ శివప్రసాద్, పలువురు జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, వార్డు సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎన్నికైన టిడిపి అనుబంధ కమిటీ

టిడిపి అనుబంధ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి-విఆర్పురం: మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రంపచోడవరం నియోజకవర్గం శాసన సభ్యురాలు రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్ ఆదేశాల మేరకు ఆదివారం అనుబంధ సంఘ కమిటీలను ఎన్నుకున్నారు. మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు. ఎస్.కె పులి, ప్రధాన కార్యదర్శి ఎండి రహీం, మండల ఎస్టి సెల్ అధ్యక్షులు మడకం రాజు, కార్యదర్శి పాయం భాస్కరరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బుర్ర నరేష్కుమార్ జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, ఎంపిటిసి వాళ్ల వెంకటేశ్వరరెడ్డి సొసైటీ అధ్యక్షులు గొంది చంద్రయ్య, పాయం రామారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, ముత్యాల సిద్ధార్థ ముత్యాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న సిఐ సన్యాశినాయుడు

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు

ప్రజాశక్తి -రంపచోడవరం : మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని రంపచోడవరం సిఐ సన్యాసినాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్స్టేషన్ ఎదుట డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీలో పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, అలాంటి సంఘటనలను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు తప్పని సరిగా లైసెన్స్లు కలిగి ఉండాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

గంజాయిపై అవగాహన

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గంజాయి వల్ల కలిగే అనర్థాలు గురించి ఎస్ఐ శివకుమార్ ఆదివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక ఎస్ఎంఎస్ వసతిగృహం స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులతో ఎస్ఐ శివకుమార్ గంజాయి వలన కలిగే అనర్దాలు గూర్చి అవగాహన సదస్సు నిర్వహించారు.